# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**NOVEMBER-2014**

సంవత్సర చందా రూ. 50/-

# టి.వి ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి :**

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6:30 గంటలకు రక్షణ |
| గురువారం ఉదయం | : | 11:00 గంటలకు రక్షణ |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

శ్రేష్టమైన జీవితం : Better Life

మంగళ, గురువారాల్లో - ఉదయం 7:30 గంటలకు రక్షణ

బుధ, శుక్రవారాల్లో - ఉదయం 9:30 గంటలకు రక్షణ

ప్రసంగీకులు : పలివెల మణికుమార్

పై కార్యక్రమములను టి.విలో చూడండి. మీ బంధు మిత్రులను కూడ ప్రోత్సహించండి. ఉచిత బైబిలు కోర్సుకొరకు మాకు ఈరోజే వ్రాయండి

SATYA VANI

P.O.BOX.80, KAKINADA

Pin : 533004

Ph : 0884 -2363722

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 34 | నవంబరు - 2014 | సంచిక -4

## మృతుల పునరుత్థానము
## (Resurrection of the Dead)

మానవులు మరణించినను ఒకానొక దినమందు తిరిగి లేచెదరను బోధ క్రైస్తవ్యములో ప్రత్యేకమైనది. మానవులందరు నిత్యము జీవించాలని, అమర్త్యతను సాధించాలని ఆశ కలిగిన వారని వెనుకటి పాఠములలో మనము గమనించి యుంటిమి. మానవుని ఆత్మ నిత్యము జీవించునని అనేకులు నమ్ముదురు. అయితే మరణము వలన శరీరముతో వేరు చేయబడిన ఆత్మ తిరిగి ఒకానొక దినమందు శరీరమును ధరించుకొనును అని బైబిలు బోధించుచున్నది. దీనినే మనము పునరుత్థానము లేక మృతులలో నుండి తిరిగి లేచుటయని చెప్పుకొంటూ యుంటాము.

పునరుత్థానము అను పదము 'అనస్తాసిస్' ( Anastasis) అనిస్టెమి (Anistemi), ఎగైరో (Egeiro) అను గ్రీకు పదముల నుండి ఉద్భవించినది. ఈ పదములు నిద్ర నుండి లేపుట, లేచుట, లేపబడుటయను భావమును కలిగియున్నవి.

క్రొత్తనిబంధన గ్రంథములో మూడు ప్రత్యేక పునరుత్థాన సంధర్భము

లను గూర్చి వ్రాయబడి యున్నది. మొదటిగా యేసును, ఆయన అపొస్తలులును చనిపోయినవారిని లేవదీయుటను గూర్చి వ్రాయబడిన సందర్భములు, రెండవదిగా యేసు తనకు గాన తాను మృతులలో నుండి లేచిన సందర్భము, మూడవదిగా మానవులందరును మృతులలో నుండి లేచుటను గూర్చిన సందర్భము.

యేసు ఈ లోకములో యున్నప్పుడు చనిపోయిన యాయీరు కుమార్తెను, నాయీరు విధవరాలి కుమారుని, లాజరును మృతులలో నుండి లేవదీసెను (మత్తయి 9:18-26; లూకా 7:11-18; యోహాను 11:23-46). అట్లే అపొస్తలుడైన పేతురు తబీతా అను చనిపోయిన స్త్రీని సజీవురాలనుగా లేవ దీసెను (అపొ.కా. 9:36-42). అపొ.పౌలు ఐతుకు అను ఒక యౌవనస్తుడు మూడవ అంతస్తు నుండి పడి చనిపోగా అతనిని లేవనెత్తెను (అపొ.కా. 20:8-12). అయితే ఈ సందర్భములలో మనము గమనించ వలసినది యేమంటే మృతులలో నుండి లేవదీయబడిన వీరందరు మరల మరణించుటకే లేవదీయబడిరి.

యేసు యొక్క పునరుత్థానమైతే అట్టిదికాదు. ఆయన మరెన్నడును మరణించకుండుటకై తిరిగి లేచెను. ఆయన చనిపోకముందే పునరుత్థానుడ నగుదునని యేసు ప్రవచించెను. (మత్తయి 16:21). ఆయన చెప్పిన రీతిగనే చనిపోయి సమాధిచేయబడి, మూడవ దినమున తిరిగి లేచెను. అది శరీరముతో కూడిన పునరుత్థానము. ఆయన తిరిగి లేచినప్పుడు మహిమ శరీరము గలవాడాయెను.

యేసు యొక్క పునరుత్థానము యధార్థమని మనము నమ్ముటకు అనేక ఆధారములు కలవు. క్రొత్త నిబంధన లోని మొదటి నాలుగు సువార్తలు క్రీస్తు పునరుత్థానమును గూర్చి బోధించుచున్నవి. ఆయన తిరిగి లేవగా ఆయనను పాతిపెట్టిన సమాధి ఖాళీగా యుండెను. ఆ సమాధి దగ్గర దేవదూత తాను చెప్పినట్టే యేసు లేచెనని సాక్ష్యమిచ్చెను (మత్త 28:7). యేసు యొక్క అపొస్తలుల జీవితములో కలిగిన గొప్ప మార్పే ఆయన తిరిగి లేచెనని మనకు నిర్ధారణ చేయుచున్నది. క్రీస్తు చనిపోవకముందు వారందరు పిరికివారై అటు యిటు పారిపోయిరి గాని ఆయన పునరుత్థానుడయ్యెనని సాక్ష్య మిచ్చుటలో వారేమియు జంకక తమ ప్రాణములనుసయితము వారు కోల్పోయినట్లు మనము గమనించ గలము. అంతే కాదు, మొదటి శతాబ్ధము నుండి నేటివరకు యున్న క్రైస్తవులు ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడుకొ

నుట, ఆరాధనలో ప్రభురాత్రి భోజనము చేయుట యనునవి క్రీస్తు యొక్క మరణ పునరుత్థానములను సూచించుచున్నవి. యేసు ఆదివారమున మృతులలో నుండి లేచుట వలన ఆరోజుకు అట్టి ప్రాముఖ్యత కలిగెను.

యేసుక్రీస్తు మృతలలో నుండి యెట్లులేచెనో అట్లే మానవులందరు లేచెదరని బైబిలు బోధించుచున్నది. క్రీస్తు లేచుట ద్వారా అది నమ్మదగిన వాస్తవ మని మనకు నిర్ధారణ చేయబడినది "ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడి యున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదామునందు ఏలాగు మృతి పొందుచున్నారో ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు" అని పరిశుద్ధాత్మావేశము వలన అపో. పౌలు 1 కొరింథీ 15:20-22లో వ్రాసెను.

ఈ పునరుత్థానము క్రీస్తు రెండవ సారి వచ్చునప్పుడు జరుగును: "యేసు మృతి పొంది తిరిగి లేచెనని మనము నమ్మిన యెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించిన వారిని దేవుడా యనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. మేము ప్రభువు మాటనుబట్టి మీతో చెప్పునదేమనగా, ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచియుండు మనము నిద్రించిన వారికంటే ముందుగా ఆయన సన్నిధిచేరము. ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగి వచ్చును; క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆమీదట సజీవులమై నిలిచియుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదా కాలము ప్రభువుతో కూడ ఉందుము" అని అపో. పౌలు మరల బోధించెను (1థెస్స 4:14-17).

మృతులైన వారందరు, నీతిమంతులేమి, అనీతిమంతులేమి అందరు ఆదిన మందు పునరుత్థానులగుదురని యేసు బోధించెను. ఆయన ఇట్లు చెప్పెను: "దీనికి ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధుల లోనున్న వారందరు ఆయన శబ్ధమును విని మేలుచేసినవారు జీవపునరుత్థానమునకును కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చె దరు" (యోహాను 5:28-29).

ఆ పునరుత్థాన దినమం[illegible] చుచున్న వారు మార్చబడుదురు. [illegible]

మీకు ఒక మర్మము తెలుపుచున్నాను; మనమందరము నిద్రించము గాని నిమిషములో, ఒక రెప్పపాటున కడబూర మ్రోగగానే మనమందరము మార్పు పొందుదుము, బూర మ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు, మనము మార్పు పొందుదుము" అని 1 కొరింధి 15:51,52లో వ్రాయబడి యున్నది.

పునరుత్థాన దినమందు సజీవులైన వారు రెప్పపాటులో మార్చబడగా మృతులై నవారు శరీరముతో కూడ లేపబడుదురు. అందుకే "మృతులలో నుండి యేసును లేపినవాని ఆత్మ మీలో నివసించిన యెడల మృతులలో నుండి క్రీస్తు యేసును లేపినవాడు చావునకులోనైన మీ శరీరము లను కూడ మీలో నివసించుచున్న తన ఆత్మ ద్వారా జీవింపజేయును" అని రోమా 8:11లో అపొ.పౌలు బోధించెను. మృతులైన వారు శరీరముతో లేచినను వారు మార్చబడిన శరీరముతో లేచెదరు. "మృతుల పునరుత్థానమును అలాగే, శరీరము క్షయమైనదిగా విత్తబడి అక్షయ మైనదిగా లేపబడును; ఘనహీనమైనదిగా ...త్తబడి మహిమ గలదిగా లేపబడును; ...హీనమైనదిగా విత్తబడి బలమైనదిగా ...డును. ప్రకృతి సంబంధమైన ...గా విత్తబడి ఆత్మ సబంధ శరీరముగా లేపబడును" అని 1కొరింధి 15:42-44తో వ్రాయబడి యున్నది.

సమాధిలో పాతిపెట్టబడిన శరీరము కంటే దాని నుండి లేచు శరీరము మేలైనదని దీని వలన గ్రహించుకొనగలము. లేపబడు శరీరము విత్తబడు శరీరము కంటె మార్పు జెందినదైనను అది తన రూపు రేఖలను (Identity) కోల్పోవు నట్టిది కాదు. మృతులలో నుండి లేచిన క్రీస్తు యొక్క శరీరము అన్ని భౌతిక ఆవాంతర ములను దాటగలిగెను. తలుపులు వేసి యుండినను ఆయన గదిలో ప్రవేశించ గలిగెను. అంతలో కనబడి అంతలో మాయమైపోగలిగెను. మనము ఇప్పుడు కలిగియున్న భౌతిక శరీరమును దేవుడు ఈలోకమునకనుకూలముగా సృజిం చెను. అట్లే నిత్య జీవితమున కనుకూల మగు శరీరమును ఆయన తప్పక మనకు దయచేయగలడు (1 కొరింధి 15:36 - 42; రోమా 8:11).

కొందరు మృతుల పునరుత్థానము లేదని వాదించెదరు: అయితే అట్టివారికి అపొ.పౌలు ఇట్లు జవాబు చెప్పుచు న్నాడు. మృతుల పునరుత్థానము లేనియెడల క్రీస్తు లేపబడి యుండలేదు. అట్లయితే అపొస్తలులు చేసిన ప్రకటన వ్యర్థమే. సరిగదా వారు అబద్ధసాక్షుల

గుదురు. క్రీస్తు లేపబడని యెడల క్రైస్తవుల విశ్వాసము వ్యర్థమే, వారింక తమ పాపములలోనే యున్నారు. అంతేకాదు క్రీస్తునందు నిద్రించిన వారునుసశించిరి. ఈ జీవితకాలము మట్టుకే క్రైస్తవులు క్రీస్తునందు నిరీక్షించువారైన యెడల మనుష్యులం దరికంటే దౌర్భాగ్యులై యుందురు (1 కొరింధి 15:12-19).

అయితే క్రీస్తు లేపబడెను, తద్వారా మనందరము చనిపోయినను మరల లేపబడుదుము అని ఆయన నిరూపించెను. క్రైస్తవుని జీవిత నిరీక్షణ కేవలము సమాధి యొద్ద అంతమయ్యేదికాదు. సమాధి కేవలము కనిపెట్టు సమయము మాత్రమే. క్రీస్తు మరల రాగా క్రైస్తవుడు ఆయనతో నిత్యము జీవించుటకు యెదురు చూచుచున్నాడు. మిత్రుడా నీసంగతి యేమి? యేసుక్రీస్తు ఈ ఘడియలో ప్రత్యక్షమైన యెడల నిత్యత్వమును ఎక్కడ గడుపుదువు? క్రీస్తుతో గడపాలనుకుంటే ఆయనయందు నమ్మి ఈనాడే బాప్తిస్మము పొంది మరణ పర్యంతము నమ్మకముగా యుందుము (మార్కు 16:16; ప్రక 2:10).

## తప్పిపోయిన కుమారుడు
## (The Prodigal Son)

లూకా 15:11-32

**పరిచయము :**

ఇంతకు ముందు చెప్పబడిన ఉపమానములు వినిన వారే తప్పిపోయిన కుమారుని ఉపమానమును కూడ విన్నారు. ప్రభువును నిందించు చున్న వారికి జవాబుగా ఆయన తప్పిపోయిన గొర్రె, పడిపోయిన నాణెము, తప్పిపోయిన కుమారుని గూర్చిన ఉపమానములను చెప్పియున్నారు. శాస్త్రులు పరిసయ్యుల నుద్దేశించి యేసు ఈ గొప్ప ఉపమానములను చెప్పాను. వారు దేవుని రాజ్యమునందు ఆసక్తిలేనివారు. గాని యేసు యూదా సమాజములో వెలివేయబడిన వారితో సాంగత్యము చేయుట చూచి కోపోద్రేకులైరి. ఆయనను విమర్శింప సాగిరి. “ఈ మనుష్యుడు పాపులను చేర్చుకొనుచున్నాడు!” అని చెప్పి వారు విమర్శించేవారు. వారికి ప్రభువు ఎట్టి జవాబిచ్చారు? వారాయనను అపార్థము చేసికొన్నారని వారికి చెప్పలేదు. సరిగదా వారు వాస్తవమును చెప్పారని అంగీకరిస్తు, నశించిన వారి యెడల ఆయన ప్రేమను ఉపమానరీతిగా ప్రగాఢముగా ప్రకటించారు.

ఉపమానము :

"మరియు ఆయన ఇట్లనెను. ఒక మనుష్యునికి ఇద్దరు కుమారులుండిరి. వారిలో చిన్నవాడు-తండ్రీ ఆస్తిలో నాకు వచ్చు భాగమిమ్మని తన తండ్రినడుగగా, అతడు వారికి తన ఆస్తిని పంచిపెట్టెను. కొన్ని దినములైన తరువాత ఆచిన్న కుమారుడు సమస్తమును కూర్చుకొని దూరదేశమునకు ప్రయాణమై పోయి అచ్చట తన ఆస్థిని దుర్వ్యాపారము వలన పాడుచేసెను. అదంతయు ఖర్చు చేసిన తరువాత ఆ దేశమందు గొప్ప కరువురాగా వాడు ఇబ్బంది పడసాగి వెళ్లి ఆదేశస్థులలో ఒకని చెంత చేరెను. అతడు పందులను మేపుటకు తన పొలముల లోనికి వానిని పంపెను. వాడు పందులు తిను పొట్టుతో తన కడుపు నింపుకొన ఆశపడెను. గాని యెవడును వానికేమియు ఇయ్యలేదు. అయితే బుద్ధి వచ్చినప్పుడు వాడు - నాతండ్రి యొద్ద ఎంతోమంది కూలి వాండ్రకు అన్నము సమృద్ధిగా ఉన్నది. నేనైతే ఆకలికి ఇక్కడ చచ్చిపోవుచున్నాను. నేను లేచి నా తండ్రి యొద్దకు వెళ్లి - తండ్రీ నేను పరలోకమునకు విరోధము గాను నీ యెదుటను పాపము చేసితిని. ఇక మీదటను నీ కుమారుడనని అనిపించుకొనుటకు యోగ్యుడను కాను, నన్ను నీ కూలి వారిలో ఒకనిగా పెట్టుకొనుమని అతనితో చెప్పుదుననుకొని లేచి తండ్రి యొద్దకు వచ్చెను. వాడింకా దూరముగా ఉన్నప్పువడు తండ్రి వానిని చూచి కనికరపడి, పరుగెత్తి వాని మెడ మీద పడి ముద్దుపెట్టుకొనెను. అప్పుడు ఆకుమారుడు అతనితో - తండ్రీ నేను పరలోకమునకు విరోధము గాను నీ యెదుటను పాపము చేసితిని, ఇక మీదట నీ కుమారుడనని అనిపించుకొనుటకు యోగ్యుడను కాననెను.

"అయితే తండ్రి తన దాసులను చూచి -ప్రశస్తవస్త్రము త్వరగా తెచ్చి వీనికి కట్టి వీని చేతికి ఉంగరము పెట్టి పాదములకు చెప్పులు తొడిగించుడి, క్రొవ్విన దూడను తెచ్చి వధించుడి. మనము తిని సంతోషపడుదుము; ఈ నాకుమారుడు చనిపోయి మరల బ్రదికెను, తప్పిపోయి దొరికెనని చెప్పెను. అంతటవారు సంతోషపడ సాగిరి. అప్పుడు అతని పెద్ద కుమారుడు పొలములో ఉండెను. వారు పొలము నుండి వచ్చుచు ఇంటి దగ్గరకురాగా, వాద్యములను నాట్యమును జరుగుట విని దాసులలో ఒకని పిలిచి ఇవి ఏమిటని అడుగగా - ఆ దాసుడు అతనితో నీ తమ్ముడు వచ్చియున్నాడు, అతడు తన యొద్దకు సురక్షితముగా వచ్చినందున నీ తండ్రి క్రొవ్వినదూడను వధించెననెను. అయితే అతడు కోపపడి లోపలికి వెళ్లనొల్లక పోయెను గనుక

అతని తండ్రి వెలుపలికి వచ్చి లోపలికి రమ్మని బతిమాలుకొనెను. అందుకతడు తన తండ్రితో ఇదిగో యిన్ని యేండ్లనుండి నిన్ను సేవించుచున్నానే, నీ ఆజ్ఞను నేనెన్నడూ మీరలేదే; అయినను నా స్నేహితులతో సంతోషపడునట్లు నీవు నాకెన్నడూ ఒక మేకపిల్లనైన ఇయ్యలేదు. అయితే నీ ఆస్తిని వేశ్యలతో తిని వేసిన యీ నీ కుమారుడు రాగానే వీనికొరకు క్రొవ్విన దూడను వధించితివని చెప్పెను. అందుకతడు కుమారుడా, నీవెల్లప్పుడును నాతోకూడ ఉన్నావు; నావన్నియు నీవి. మనము సంతోషపడి ఆనందించుట యుక్తమే. ఈ నీతమ్ముడు చనిపోయి తిరిగి బ్రదికెను, తప్పిపోయి దొరికెనని అతనితో చెప్పెను" (లూకా 15:11-32).

ఈమనుష్యుని ఇద్దరి కుమారులలో చిన్నవాడు తన తండ్రిని ఆస్తికొరకు అడిగెను. తండ్రి అతని కోరికను మన్నించెను. యూదుల పద్ధతి ప్రకారము తండ్రి మరణించిన తదనంతరము చిన్నవానికి తండ్రియొక్క ఆస్తిలో మూడవ భాగము సంక్రమించును. పెద్దవానికి రెండంతలు వెళ్లును. ఈ సందర్భములో మూడింటిలో రెండు వంతులు పెద్దవానికి సంక్రమించును. తండ్రి బ్రదికి యుండగా కుమారులు ఆస్తిలో భాగమును కోరు కొనుటకు ఆధార మేమియులేదు, అట్టి సందర్భములు కూడ లేవు. అట్టి కోరికను మన్నించుటకు తండ్రి కూడ బాధ్యుడు కాడు.

అయితే ఈ సందర్భములో రెండవ వాడు మొదటివానిగా అగుపడుచున్నాడు. అతడు నిశ్చయించేసుకొన్నాడు. అతడు తన కుటుంబమును విడిచి వెళ్లిపోవ డానికి నిశ్చయించేసుకొన్నాడు. అది అనాలోచిత చర్యయే. అయినను తండ్రి అతని కోరికను మన్నించాడు. అతడు వెళ్లిన 'దూరదేశము' సాధారణంగా పాపులు పోయే దూర ప్రాంతము.

అది దేవుని నుండి దూరమై పోయిన దూరప్రాంతము (కీర్తన 10:4 ఎఫెసీ 2:12,13). ఒకడు దేవుని నుండి దూరమైనప్పుడు దూరదేశమునకు పోయిన వాడవుతాడు.

సరదాగా, కులాసాగా జీవించే జీవితము కొంచెము కాలమే. ఒకడు జీవనోపాధిని సంపాదించుట కొరకు బాధ్యత వహించాలి. తప్పిపోయిన కుమారుడు తన కుటుంబమునేగాక, తన జీవనోపాధిని తండ్రి నేర్పిన వృత్తిని కోల్పోయాడు. కులాసా జీవితం గడిపితే, ధన నిధులు త్వరితంగా మాయమై పోతాయి. కరువు కాలములో పేదరికము తరుముకుంటు వచ్చును. పనిచేసి భౌతికాశీర్వాదములను పొందుటను గూర్చి అపొ. పౌలు నేర్పించాడు (2 థెస్స 3:10; 1 తిమో 5:8).

దేవుని యెడల భయము లేకుండుట వలన చిన్న కుమారుడు తప్పిపోయాడు. దేవుని యెడల, కుటుంబము యెడల, ఆయన నీతియెడల గౌరవము లేనందున అతడు నశించాడు. అతడు తన ఇష్టము వచ్చినట్లు ప్రవర్తించాడు గనుక నశించాడు. అతడు తనను గూర్చియే గాని ఇంటిలో నున్న వారెవరిని గూర్చి గాని ఆలోచించుకోలేదు.

తన దంతయు ఖర్చుచేసిన తరువాత అతడు పొలములలోనికి వెళ్లి పందులను మేపవలసి వచ్చినది. పంది అపవిత్ర జంతువు గనుక, యూదునికి యిది బహు అవమాన కరమైన పని (లేవి 11:7). యూదుడు పందులను మేపుట కంటే హేయమైన వృత్తి ఇంకొకటి యుండదు. హేయమైన తన కోరికలకు లొంగిపోయినందున అతడు పందులు తినుపొట్టుతో తన ఆకలి తీర్చుకొనగోరే స్థితికి దిగ జారవలసి వచ్చినది.

అయితే చివరకు తప్పిపోయిన కుమారుడు, తానున్న ఘోరదుస్థితిని గూర్చి గ్రహించుకొన్నాడు. తానున్న హేయమైన వాతావరణం, అల్లలాడుచున్న ఆకలి మొదలగువాటిని అతడు గ్రహించుకొన్నాడు. తన దీనస్థితికి తానే కారకుడని గ్రహించుకొన్నాడు. తన పాపపు స్థితికి, తండ్రి నుండి దూరమవుటకు తానే కారకుడు.

దుష్టత్వము వలన మనకు మనమే హానిచేసికోనవచ్చును. మన పొరుగువారి యెడల ద్రోహము జరిగించ వచ్చును గాని దేవునికి విరోధముగా మాత్రమే పాపము చేయుదుము. దీనిని గుర్తించుటే మారుమనస్సు యొక్క ముఖ్యలక్షణము. తన అయోగ్యతను గ్రహించుకొనిన వాడై, నీ కుమారులలో ఒకనిగా యుండుటకు యోగ్యుడను కానని ఒప్పుకుంటాడు. ఇట్టి ఒప్పుకోలు మారుమనస్సు యొక్క నిజమైన లక్షణము. పాపము చేయుట దేవునిపై తిరుగుబాటు చేయుటే. రాజైన దావీదు కూడ తన పాపమును గూర్చి ప్రశ్నించినప్పుడు, "నేను పాపము చేసితినని" ఒప్పుకున్నాడు (2 సమూ 12:13).

తప్పిపోయిన కుమారుడు మొదట్లో ఆస్థిలో తనకు వచ్చు భాగమిమ్మని కోరాడు గాని మారు మనస్సు పొంది నప్పుడు తండ్రియొక్క కూలివానిలో ఒకనిగా పెట్టుకోమని ప్రార్థించాడు. అతడు తిరిగి రాగా తండ్రి ప్రేమతోను. కృపతోను స్పందించాడు. కొడుకు తండ్రికి గొప్ప అన్యాయము చేసాడు. గాని తండ్రి అతనిని సంతోషముతో చేర్చుకొన్నాడు. తప్పి పోయిన కుమారుడు తిరిగి వచ్చినప్పుడు పొందిన స్వాగతం, మారుమనస్సు

పొందిన పాపులను దేవుడు చేర్చుకొనే విధానాన్ని మనకు వర్ణించుచున్నది.

అతడు తిరిగి రాగా తండ్రి అతని మెడ మీద పడి ముద్దులతో అతని నింపెను. ప్రతిరోజు అతని రాకకై తండ్రి వేచి యుండేవాడు. మారుమనస్సు పొందే పాపిని దేవుడెట్లు చేర్చుకొంటా రోగదా! చేతులుచాచి కౌగలించుకొని, పాపములన్నిటిని మరచిపోయి ఆయన ఆహ్వా నిస్తారు. ప్రశస్తమైన వస్త్రము ధరింప చేయుటద్వారా అతని కుమార త్వాన్ని హక్కులను తండ్రి అతనికి తిరిగి ప్రతిష్టించాడు. క్రొవ్విన దూడను వధించుట, సంతోషముతో సంబరము జరిపించుట ఇవన్నీ దానిలో భాగమే. క్రొవ్విన దూడ ప్రత్యేక దినము కొరకు ఉంచబడాలి (1 సమూ 28:24). ఒకడు దేవుని యొద్దకు తిరిగి వచ్చుట ప్రత్యేక మైనదే !

విచారం యేమంటే పడిపోయిన సహోదరలు తిరిగి వస్తే క్రైస్తవులు ఉత్సాహము చూపరు. నశించిన ఆత్మలు రక్షింపబడినప్పుడు పడిపోయిన సహోద రులు తిరిగి వచ్చినప్పుడు (యాకోబు 5:19-20), సంతోషించుటకు గొప్ప అవకాశములున్నవి. మారుమనస్సు పొందిన వారి నెల్లప్పుడు స్వాగతించాలి (1 యోహాను 4:8; 2 కొరింథీ 2:7). గాని క్రైస్తవులుతరుచు ఈ ఉపమానము లోని పెద్దకుమారుని స్వభావమును కనుబరతురు.

పాపియైన వాడు పునరుద్ధరించ బడతాడని కొందరు నమ్మరు . ఒకడు పాపములో పడిపోతే అతడెన్నడు రక్షించ బడలేదని వారనుకొంటారు. పాపములో పడిపోయినవారు దేవుని యొద్దకు తిరిగి వచ్చిన సందర్భములనేకములు బైబిలు నందున్నవి. (అపో.కా. 8:22; యాకోబు 5:19-20; యూదా : 23). పడిపోయిన వాడు మారుమనస్సుపొంది దేవుని యొద్దకు తిరిగి రాగలడని ఈ ఉపమాన ము బోధించుచున్నది. దేవునిబిడ్డయైన వాడు పాపముచేస్తే తిరిగి రాలేడను సిద్ధాంతమును అది తిరస్కరించుచున్నది (లూకా 15:18-20; 1 యోహాను 1:9; 2:1-2; అపో.కా. 8:18-24).

ఇప్పటి వరకు ఈ ఉపమానమంత యును తప్పిపోయిన కుమారుని గూర్చి యుంటే, పెద్ద కుమారుని యొక్క దుష్ట స్వభావము ఆశ్చర్యము కలిగించుచు న్నది. నిజానికి శాస్త్రులు పరిసయ్యులు కూడ అతని గూర్చి ఆశ్చర్యపడిరి గాని సరదాపడలేదు. 25-32 వచనాలలో యేసు పెద్దకుమారుని తప్పుబట్టారు. పెద్దకుమారుని చిత్రములో శాస్త్రులు పరిసయ్యుల యొక్క కఠిన స్వభావాన్ని దంబాన్ని, స్వనీతిని ఆయన వారికి వర్ణించారు.

తండ్రి పెద్దకుమారుని బ్రతిమలాడారు. అతడు తండ్రి యొద్దకు రాకపోయినను తండ్రే అతని యొద్దకు వెళ్లాడు. అతడు గమనించి యుండకపోయినను పెద్ద కుమారుడు తన స్వాస్థ్యమును రెండంతలు అనుభవించుచున్నాడు. తండ్రి అతనితో, "కుమారుడా, నీ వెల్లప్పుడును నాతోకూడ ఉన్నావు; నావన్నియు నీవి" అని చెప్పెను (లూకా 15:31). అంతేకాదు తండ్రి తన కుమారుని, పెద్దవాడు తన తమ్ముని తిరిగిపొందారు. ఇంకేమికావాలి? ఈ ఉపమానములో తండ్రి పరలోకమందున్న తండ్రివలె తన దాతృత్వాన్ని ప్రదర్శించాడు. పెద్దవాడు ఎంత దుష్టుడైనను తండ్రి అతనికి తరుణమిచ్చి లోపలికి రమ్మని ప్రేమతో ఆహ్వానించాడు.

పెద్దవాడు తన పాపములో నిలిచి యుండగానే ఈ ఉపమానము ముగియును. శాస్త్రుల యొక్కయు, పరిసయ్యుల యొక్కయు స్వభావము పెద్ద కుమారుని స్వభావమును పోలినది. పాపుల ఆత్మల విలువను గ్రహించకుండా నాటి మత నాయకులు తమ దురభిమాన ద్వేషములోనే యుండిపోయారు.

చిన్న కుమారుడు లోపలను పెద్ద కుమారుడు వెలుపలను యున్న వేళ తెరదించబడినది. పాపులు మారుమనస్సు పొంది యేసును అంగీకరించారు. శాస్త్రులు పరిసయ్యులు ఆయనను నిరాకరించారు.

**ముగింపు :**

ఈ ఉపమానము మూడు అంచెలుగా యున్నది. గృహాన్ని నిరాకరించుట, గృహానికి తిరిగి వచ్చుట, గృహములోనికి స్వాగతము, ఇంటిలోనే యుంటూ తప్పిపోయిన కుమారుడు అదనంగా మనకు కనబడ్డాడు. రకరకకాల పాపులున్నారని, రకరకకాల కారణాలవలన వారు తప్పిపోయారని యేసు ఈ విధంగా చూపించారు.

మనం రక్షింపబడాలని దేవుడు కోరుచున్నారు. "ఎవడును నశింపవలెనని ఇచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని" ఆయన కోరుచున్నారు (2 పేతురు 3:9). అయోగ్యులమును, పాపులమునైన మనలను దేవుడు ప్రేమించుచున్నారు. మనలను మనము తగ్గించుకొనాలి, మారుమనస్సు పొంది ఆయన చెంతకు చేరాలి.

– లూయిస్ రష్‌మోర్

# రక్తము ద్వారా విమోచన
## (Redemption by Blood)

రక్త బలి అర్పణ ద్వారా పాప విమోచన కలుగునను భావమును చెరగని రీతిగా లేవీయకాండము తెలియజేయు చున్నది. రక్తమును తినకూడదని దేవుడు ఇశ్రాయేలీయులను నిషేధించినట్లు లేవీ 17:11లో మనము చూడగలము. "రక్తము దేహమునకు ప్రాణము. మీ నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయునట్లు బలిపీఠము మీద పోయుటకై దానిని మీకిచ్చితిని. రక్తము దానిలో నున్న ప్రాణమును బట్టి ప్రాయశ్చిత్తము చేయును. కాబట్టి మీలో ఎవడును రక్తమును తినకూడదనియు మీలో నివసించు ఏ పరదేశియు తినకూడదని యు నేను ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపిం చితిని" (లేవీ 17:10-12). "పాపము చేయువాడే మరణము నొందునని" ఆయన చెప్పినప్పుడు, పాపమువలన ఒకడు చని పోవును లేదా తనస్థానములో దేవునికి ఆమోదయోగ్యమగు వేరొక దానిని తనకు బదులుగా అర్పించును. యిట్టిది త్యాగపూరిత ప్రాయశ్చిత్తము అనబడును. అందువలన ఒక జంతువు తన రక్తము నర్పించినప్పుడు, అదితన ప్రాణము నర్పించును.

**భవిష్యత్తులో జరుగు గొప్ప బలియాగము :**

నిజానికి యిందంతా యేసు ప్రభువు ఇష్టపూర్వకముగా మానవ జాతి రక్షణార్ధము తనప్రాణమును ధారబోవు దానికి సాదృశ్యముగా యున్నది. రక్తము ద్వారా విమోచనయను భావాన్ని లేవీయ కాండము దృఢముగా నిరూపించుచున్నది. మోషేధర్మశాస్త్రము పాపపుసమస్యను పరిష్కరించగలిగినది కాదని లేవీకాండము బలపరచుచున్నది. అదట్లు జరిగించాలని ఎన్నడు ఉద్దేశించబడలేదు. "ఏలయనగా ఎడ్లయొక్కయు మేకల యొక్క రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" అని హెబ్రీ పత్రిక లేఖకుడు తెలియ జేయుచున్నాడు (హెబ్రీ 10:4). గనుక అర్పింపబడే ఈ జంతుబలులన్నిటి వెనుక, పాపము యొక్క సమస్యను ఇక లేకుండా పరిష్కరించు ఒకే ఒక్క గొప్ప బలి రాబోవు చున్నదనే వాస్తవము బహిర్గంతము చేయ బడుచుండెను. ఆ కడవరి బలి యేసుక్రీస్తే.

మరియు ఈ బల్యర్పణ పద్ధతిలో, మోషేధర్మశాస్త్రము శాశ్వతముగా నిలు చుండేది కాదని కూడ బహిర్గతము చేయబడుచుండెను. అది తాత్కాలికం, అశాశ్వతం. మోసికొనిపోబడుచున్న ప్రత్యక్షగుడారము మోషేధర్మశాస్త్రము

యొక్క తాత్కాలిక స్థితిని చెప్పకనే చెప్పుచు చివరకు అది అంతమొందించబడునని సూచించుచున్నది.

**రెండు రకములైన ప్రవచనములు :**

అందువలన లేవీ యాజక ధర్మము ఒక ప్రవచనముగా యున్నది. అది యేసు క్రీస్తును గూర్చిన ప్రవచన పద్ధతి మరియు ఒక విధముగా క్రైస్తవులను గూర్చి కూడ అది ప్రవచించుచున్నది.

పాతనిబంధనలో ముఖ్యముగా రెండు రకములైన ప్రవచన విధానము మనకు కనబడును. ఒకటి వాక్పూర్వక ప్రవచనము (Verbal Prophecy). యిది సూక్ష్మముగా నోటి మాటలతో చెప్పే ప్రవచనము. రాబోవు మెస్సీయను గూర్చి ఆయన జీవితమును గూర్చి సాధారణంగా నోటి మాటలతో పలుకు ప్రవచనము: ఉదా: కీర్తనలు 2:6-7లో, దేవుడు "నేను నాపరిశుద్ధ పర్వతమైన సీయోను మీద నారాజును ఆసీనునిగా చేసి యున్నాను. కట్టడను నేను వివరించెదను. యెహోవా నాకీలాగు సెవలవిచ్చెను - నీవునా కుమారుడవు నేడు నిన్ను కనియున్నాను" అని చెప్పెను గనుక యిది క్రీస్తు పునరుత్థానము యొక్క ప్రవచనము: అపొ.కా. 2లో అపొ. పేతురు ఈ ప్రవచనమును ఎత్తి చూపించాడు. దేవుడు తన పరిశుద్ధుని పాతాళములో విడువ లేదని ఆయన తన పరిశుద్ధునికి కుళ్లుపట్టనియ్యడని దాని వివరణను పేతురు అక్కడ యిచ్చెను. దీనిని 16వ కీర్తన వాక్పూర్వక ప్రవచనముగా మనకు చెప్పుచున్నది.

క్రీస్తు ఒక కన్యకు జన్మించునని, ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టుబడునని యెషయా 7:14 లో ప్రవచింపబడెను. కీర్తన 22:16-18లో క్రీస్తు సిలువనుగూర్చిన వాక్పూర్వక ప్రవచనమున్నది: "వారు నా చేతులు నాపాదములు పొడిచి యున్నారు. నాయెముకలన్నియు నేను లెక్కింపగలను. వారునిదానించుచు నన్ను తేరి చూచుచున్నారు. నా వస్త్రములు వారు పంచుకొనుచున్నారు, నా అంగీకొరకు చీట్లు వేయుచున్నారు". క్రీస్తుయొక్క త్యాగపూరిత బలిని గూర్చిన ఈ వివరణలు కొన్ని వందల సంవత్సరముల ముందే ప్రవచనాత్మకముగా బయలుపరచబడెను. మెస్సీయ బేత్లెహేములో జన్మించునని మీకా 5:2 లో వందలాది సంవత్సరముల ముందే ప్రవచింపబడెను. యివినోటిమాట ద్వారా బయల్పరచబడిన ప్రవచనముల ఉదాహరణగా యున్నవి.

**పద్ధతి ప్రకారమైన ప్రవచనము : (System Prophecy)**

వాక్పూర్వక ప్రవచనమేగాక పద్ధతి ప్రకారమైన వేరొక రకమైన ప్రవచనము కలదు. పద్ధతి ప్రకారమైన

ప్రవచనములో వ్యక్తులు, కార్యకలాపములు, సందర్భములు వగయిరా కలిసి ఒక విశిష్టమైన ప్రవచనముగా సూచించబడును. ఇట్టివి చరిత్రాత్మక సందర్భమును బట్టి భవిష్యత్తులో క్రీస్తును గూర్చి సూచించును, ప్రవచించును.

ఇందును గూర్చిన ఒక ఉదాహరణ : సంఖ్యాకాండము 21:6లో ఇశ్రాయేలీయులు అల్పవిశ్వాసమును బట్టి దేవునికి వ్యతిరేకముగా సణగిరి. దేవుడు వారి మధ్యకు విషసర్పములను పంపగా అనేకులు వాటి వలన కాటు వేయబడి మృత్యువాతబడిరి. మరణకరమైన ఆసర్పకాటునుండి వారిని రక్షించుటకు, దేవుడు ఇత్తడి సర్పమునొక దానిని చేయించుమని మోషేకు ఆజ్ఞాపించెను. ఆసర్పము యొక్క ప్రతిమను చేయించి స్తంభము మీద పెట్టుము, అప్పుడు కరవబడిన ప్రతివాడును దానివైపు చూచి బ్రతుకునని ఆయన మోషేకు చెప్పెను (సంఖ్యా 21:8).

జరిగిన ఈ సంఘటన శీర్షికను యేసు యొక్క సిలువకు సూచనగా యోహాను దానిని ఉదహరించి యున్నాడు. "అరణ్యములో మోషే సర్పమును ఏలాగు ఎత్తెనో ఆలాగే విశ్వసించు ప్రతివాడును నశింపక ఆయన ద్వారా నిత్యజీవము పొందునట్లు మనుష్యకుమారుడు ఎత్తబడవలెను" (యోహాను 3:14-15).

సంఖ్యాకాండము 21లో జరిగిన సంఘటనలను యేసు క్రీస్తు సిలువ యొక్క ప్రవచనముగా యోహాను పరిగణించి యున్నాడు. ఆ విషసర్పముల యొక్క సంఘటన యేసు క్రీస్తును గూర్చిన గురుతు, పద్ధతి ప్రకారమైన ప్రవచనము.

**ఇశ్రాయేలీయుల అరణ్య అనుభవము :**

నిర్గమకాండములో జరిగిన సంఘటనల శీర్షిక అంతయు ఒక పద్ధతి ప్రకారమైన ప్రవచనమే. నిజానికి నిర్గమకాండమంతయు ఇట్టి ప్రవచనమే. ఇశ్రాయేలీయులను మోషే ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించి, వారిని అరణ్యములోనికి కొనిపోవచ్చాడు. వారు వాగ్దాన దేశమునకు ప్రయాణమై పోవుచుండిరి. హెబ్రీ పత్రిక 3,4 అధ్యాయములు యేసు ఆరంభించిన క్రొత్త నిర్గమమును మనకు వర్ణిస్తాయి. యేసు ప్రజలను తమ పాపముల 'ఐగుప్తు' నుండి విడుదల చేసి క్రీస్తు యొక్క రాజ్యములోనికి నడిపించుచున్నారు. గనుక నిర్గమకాండము యొక్క సంఘటనలన్నియు క్రీస్తును గూర్చి ఆయన అనుగ్రహించు విముక్తిని గూర్చిన ప్రవచన శీర్షికయై యున్నది.

**ప్రవచనాత్మకమైన పస్కా :**

మరల లూకా 22:15లో యేసు ప్రభువు చరిత్రాత్మకమైన పస్కాను ఆచరించుట మనము చూడగలము.

యేసును తన అపోస్తలులును దానిలో పాల్గొనిరి. "అప్పుడాయన - నేను శ్రమపడకమునుపు మీతో కూడ ఈ పస్కాను భుజింపవలెనని మిక్కిలి ఆశ పడితిని. అది దేవుని రాజ్యములో నెరవేరు వరకు ఇక ఎన్నడును దాని భుజింపనని మీతో చెప్పుచున్నానని వారితో చెప్పెను" (లూకా 22:15-16). యేసు యొక్క మాటలను బట్టి పస్కాను ఆయన ప్రవచనముగా భావించెనని అది ఆయన యందు నెరవేరవలసి యున్నదని ఆయన ఎరిగియున్నారని మనం గ్రహించగలము. ప్రవచనము కోరేది అదే.. దానినెరవేర్పు! ప్రవచనము నెరవేరవలెను లేదా దానిని గూర్చిన ఆకాంక్ష విఫలమగును. పస్కాలో ఇమిడి యున్న ప్రవచనములను ఆయన నెరవేర్చ వలసి యున్నదని యేసు ఎరిగి యుండెను. అందుకే "క్రీస్తు అను మన పస్కాపశువు వధింపబడెను గనుక ... పండుగ ఆచరింతము" అని 1 కొరింథీ 5:7-8లో పౌలు చెప్పెను. ఇంకొక మాటలో హెబ్రీయులకే కాదు, క్రైస్తవులకు కూడ పస్కాయున్నది. హెబ్రీయులు ఒక మచ్చలేని గొర్రెపిల్లను పస్కాపశువుగా వధించేవారు. మనగొర్రెపిల్ల అయితే మచ్చలేని దేవుని గొర్రెపిల్లయగు ప్రేమ మూర్తియైన యేసుక్రీస్తే. ఆయన రక్తము విశ్వాసము ద్వారా మన హృదయ ద్వార బంధముల మీద చిలకరింపబడెను.

పాపము యొక్క బానిసత్వము నుండి మనము విడుదల చేయబడి యున్నాము. మనం ఇప్పుడు వాగ్దానము చేయబడిన పరలోకము వైపు ప్రయాణించుచు న్నాము. యిదంతా సంఘటనాత్మకమైన పద్ధతి ప్రవచనమే !

**యేమీ విరుగని ఎముకలు**

హెబ్రీయుల పస్కా గొర్రెపిల్ల విషయమైన ఆసక్తి జనకవాస్తవం ఒకటి యేమంటే, దాని ఎముకలలో ఒక్కటి కూడ విరుగకూడదు (నిర్గమ 12:46). నిజానికి దాని ఎముకలలో ఏదియు విరుగకూడదు అనే ఆజ్ఞలో ప్రత్యేకత యేమీవున్నట్లుగుపడదు. గాని అంత తేలికగా కనబడుచున్న ఆజ్ఞసిలువ పై యేసు యొక్క ఎముకలలో ఏదియు విరుగకుండుటలో గొప్ప భావార్థమును సంతరించుకొనుచున్నది. "అతని యెముకలలో ఒకటైనను విరువబడదు అను లేఖనము నెరవేరునట్లు ఇవి జరిగెను" (యోహాను 19:36). సైనికులు వచ్చి యేసుతో కూడ సిలువ వేయబడిన వారి యిద్దరి కాళ్లను విరుగగొట్టిరి. వారు యేసు నొద్దకు వచ్చి అంతకుముందే ఆయన మృతి పొంది యుండుట చూచి అయన కాళ్లను విరుగ గొట్టలేదు" (యోహాను 19:32-33). సైనికులు వచ్చుసరికి ఆ యిద్దరు దొంగలు ఇంకా బ్రదికేయుండిరి. పస్కానాడు వారు

సిలువపై వ్రేలాడకుండునట్లు సైనికులు వారి కాళ్లను విరుగగొట్టి వారిమరణమును వేగవంతము చేసిరి. అయితే యేసు అప్పటికే మృతిబొందినందు వలన వారాయన ఎముకలను విరుగగొట్టలేదు. ఇశ్రాయేలీయుల పస్కాలో యేసు సిలువపై స్పృహ కోల్పోయెనని, నిజముగా పునరుత్థానము జరుగలేదని సాతాను కల్పించబోయే కట్టు కథకు దేవుడు ఆదిలోనే అంతమును సంకల్పించెను. ఇవ్విధమైన పద్ధతి ప్రకారమైన సంఘటనాత్మక ప్రవచనము మన విశ్వాసాన్ని బలపరుచును, చరిత్రను స్థిరపరచును.

పునరుత్థానమును శంకించువారు బయలుదేరుదురని దేవుడెరిగిన వాడై యేసు యొక్క ఎముకల విషయమైన సంఘటనలో దేవుడు వారికి ఖచ్చితమైన రుజువును సమర్పించి వారి అపోహాలను పటాపంచలు చేసెను.

**ప్రవచనాత్మక జలప్రళయము :**

ఆదికాండము 7లో సంభవించిన జలప్రళయమునకును క్రీస్తుని బాప్తిస్మముకును సారూప్యమున్నదని అపొ. పౌలు పేతురు సవిస్తరముగా మనకు తెలియజేయుచున్నాడు. ఈలోకమంతయు పాపముతో నిండి పొంగిపొర్లుచున్నందున, దేవుడు ఈపాపపు ప్రళయమును గొప్ప జల ప్రళయముతో నాశనముగావించారు. అయితే ఆ జల ప్రళయములో ఎనిమిది మంది మాత్రమే రక్షింపబడ్డారని కూడ అపొ. పేతురు చెప్పుచున్నాడు (1 పేతురు 3:20). 21 వ వచనములో దాని యొక్క ఆత్మీయ భావార్ధమునతడు చెబుతు "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" యని అతడు చెప్పెను. నోవహు కాలము నాటి పాపప్రపంచము భౌతికంగా జలప్రళయములో నశించెను. ఇప్పుడు దానికి సాదృశ్యముగా యున్న పాప లోకమును బాప్తిస్మము ద్వారా దేవుడు నశింపజే యుచున్నాడు. గనుక ఈ రెండింటికి ఒక సమానాంతరమున్న ది. పాత నిబంధన జలప్రళయములో క్రీస్తవ బాప్తిస్మము యొక్క సాదృశ్యమున్నది. నోవహుకాలమునాటి జల ప్రళయము నాటి పాపపుప్రపంచమునుండి దేవుడు వారిని ఎట్లు రక్షించెనో అట్లే పాపియైన వాడు బాప్తిస్మము పొంది రక్షింపబడ వచ్చును, బాప్తిస్మము పొందువానిని రక్షించేవాడు యేసుక్రీస్తే.

**యెషయాలో పద్ధతి ప్రవచనము:**

గనుక ఈ భౌతిక సంఘటనలు అయాశీర్షికలుగా ఆత్మీయ భావార్ధముతో నిండియున్నవి. యెషయా 35వ అధ్యాయమును చదివిన యెడల క్రీస్తు రాజ్యము యొక్క వివరములను అక్కడ కనుగొన గలవు. "అక్కడ దారిగా నున్న రాజమార్గమేర్పడును. అది మార్గమున

పోవు వారికి ఏర్పరచబడును. మూఢులైనను దానిలో నడుచుచుత్రోవ తప్పక యుందురు" (యెషయా 35:8). క్రీస్తుతన ప్రజల కనుగ్రహించు ఆత్మీయవాస్తవములను భౌతిక సంగతులతో యెషయా అక్కడ ఉదహరించాడు. ఎడారిలో ఎండిన భూమి బహుగా పూయుచు ఉల్లసించును. చెవిటివారి చెవులు విప్పబడును, గ్రుడ్డి వారి కన్నులు తెరువబడును.

యివి యేసు క్రీస్తులో నెర వేర్చబడబోవు ఆత్మీయ సంగతులకు ఈయబడిన భౌతిక వర్ణనలు. పాపముతో నిండియున్న మన ఎడారి భూమిని యేసు ఫలభరితమైన ఏదెను వనము వలె చేయును.

– సశేషం

## నోవహుఓడ
## (Noah's Ark)

క్రైస్తవ జీవితము ఓడ ప్రయాణము వంటిది. "నరుల చెడుతనము భూమి మీద గొప్పదనియు వారి హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు కేవలము చెడ్డదనియు యెహోవా చూచి తాను భూమి మీద నరులను చేసినందులకు యెహోవా హృదయములో నొచ్చుకొనెను (ఆది.కా. 6:5). ఆది.కా. 6:7 "నరులను, జంతువులను, పురుగులను ఆకాశ పక్ష్యాదులను భూమి మీద నుండ కుండా తుడిచి వేయుదును" అని దేవుడు తలంచెను. (ఆది.కా. 6:8-9). "అయితే నోవహు యెహోవా వలన కృప నొందినవాడును నీతిమంతుడును ఆ తరము వారిలో నిందారహితుడు" కనుక నోవహు కుటుంబమును దేవుడు జ్ఞాపకము చేసికొని చితిసారకపు మ్రానుతో ఒక ఓడను నిర్మించమని చెప్పెను. అది 300 మూరలు పొడవు, 50 మూరలు వెడల్పు 30 మూరలు ఎత్తు ఉండునట్లు 3 అరలుగా నిర్మించమన్నాడు. ఆది 6:23 "నోవహు అట్లు చేసెను. దేవుడు అతనికి ఆజ్ఞాపించిన ప్రకారంయావత్తూ చేసెను".

ఓడ నిర్మాణములో దేవుని యొక్క ఉద్దేశమును పరిశీలింతము

**దేవుని భద్రత :**

"విశ్వాసమును బట్టి నోవహు అదివరకు చూడని సంగతులను గూర్చి దేవుని చేత హెచ్చరింపబడి భయభక్తులు గలవాడై తన ఇంటివారి కొరకు ఒక ఓడను సిద్ధము చేసెను. అందువలన అతడు లోకము మీద నేరస్థాపన చేసి

విశ్వాసమును బట్టి కలుగు నీతికి కారకుడాయెను (హెబ్రీ 11:7).

నోవహు దేవుని మాట చొప్పున, దేవుడు తనకు ఆజ్ఞాపించినది యావత్తూ చేసెను. దేవుని మాటకు విధేయత చూపాడు. దేవుని మాట యందు విశ్వాస ముంచాడు. తన కుటుంబాన్ని జలప్రళయ మునుండి రక్షించుకున్నాడు. దేవుని యొక్క భద్రత ఆకుటుంబముపై యున్నది.

యేసుప్రభువు ఈలాగు చెప్పు చున్నారు "కాబట్టి యీ నామాటలు విని వాటి చొప్పున చేయు ప్రతీవాడును బండమీద తన ఇల్లు కట్టుకొనిన బుద్ధి మంతుని పోలియుండును" (మత్తయి 7:24).

1కొరింధి 3:10,11 లో అపొ. పౌలు ఈలాగుచెప్పుచున్నాడు. దేవుడు నాకనుగ్రహించిన కృప చొప్పున నేర్పరియైన శిల్పకారునివలె పునాది వేసితిని మరియొకడు దాని మీద కట్టుచున్నాడు. ప్రతీవాడును దాని మీద ఏలాగు కట్టుచున్నాడో జాగ్రత్తగా చూచుకొనవలెను. వేయబడినది తప్ప మరియొక పునాది ఎవడును వేయనేరడు. ఈ పునాది క్రీస్తే".

"సమాధాన మేమియు లేక పోయినను. సమాధానమని చెప్పి నాజనులను మోసపుచ్చుచున్నారు. నాజనులు మట్టి గోడను కట్టగా వారు వచ్చి గచ్చు పూతపూసెదరు". వర్షమురాగా అది కరిగి పోవును. అబద్ధబోధలు మట్టి గోడకుగచ్చుపూత వంటివి (యెహెజ్కేలు 13:10).

మనము క్రీస్తు అనే బండపై మన ఆత్మీయ జీవితమును కట్టుకోవాలి. క్రీస్తు మాటచొప్పున మనము చేయాలి.

నోవహు కట్టిన ఓడలో నోవహుకు అతని కుటుంబమునకు అందున్న జంతువులకు భద్రతయున్నది. ఓడ వెలుపట ఉన్న వారికి అభ్రదత లేదు. జలప్రళయము తరువాత భూమిని నింపించడాన్కి దేవుడు నోవహును అతని కుటుంబమును ఆయా జంతువులను ఓడలో దేవుడు భద్రపరిచాడు.

దేవుని రాజ్యము నింపడాన్కి క్రీస్తునందు విశ్వాసముంచి పాపక్షమాపణ నిమిత్తమై బాప్తీస్మముపొందిన వారిని క్రీస్తు సంఘము అనే రక్షణఓడలో భద్రపరిచాడు. కనుక మనము ఆయన చెప్పినట్లుగా చేయాలి.

**దేవుని వలన అభివృద్ధి :**

ఆది.కా. 8:18, 9:1, 9:7 వచనములలో జలప్రళయము తరువాత ఓడనుండి వెలుపలికి వచ్చిన నోవహును

యెహోవా ఈలాగు ఆశీర్వదించెను "మీరు ఫలించి, అభివృద్ధిచెంది భూమిని నింపుడి". 1 రాజు 9:26:28 "రాజైన సొలొమోను ఏదోము దేశపు ఎఱ్ఱసముద్రపు తీర మందున్న ఏలతు దగ్గర ఎసోన్గెబెరునందు ఓడలను కట్టించెను .... బంగారమును రాజైన సొలొమోను నొద్దకు తీసికొని వచ్చిరి. 1రాజు 10:22 సముద్ర మందు హీరాము ఓడలతో కూడా తర్షీషు ఓడలను రాజు కల్గి యుండెను. ఈతర్షీషు ఓడలు 3 సం॥లుకొకసారి బంగారమును, వెండిని, దంతమును కోతులను, నెమలి పిట్టలను తీసికొని వచ్చెచుండెను. ఈప్రకారము రాజైన సొలొమోను ధనము చేతను, జ్ఞానము చేతను భూపతులందరిలో అధికుడై యుండెను".

లూకా 5:6,7 యేసు యొక్క మాట విని శిష్యులు వలలు వేయగా వలలు పిగిలి పోవునంతగా చేపలుపడెను. రెండు దోనెలు మునుగునట్లు చేపలను నింపిరి. యేసుక్రీస్తు మాటవినుట వలన అభివృద్ధి ఉంటుంది.

ఆది 26:12 ఇస్సాకు ఆదేశమందు ఉన్నవాడై విత్తనము వేసి ఆసంవత్సరమందు నూరంతల ఫలము పొందెను. యెహోవా అతని నాశీర్వదించెను గనుక ఆ మనుష్యుడు గొప్పవాడాయెను.

కీర్త 1:1,2 "దివారాత్రులు యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించువాడు ధన్యుడు అతడు ఆకువాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె ఉండును". ఆదిమ సంఘము కూడా సంఖ్యలోను, ఆత్మీయము గాను అభివృద్ధి చెందిరి. అపొ. 2:42, అపొ. 4:4లలో 3000 మంది 5000 మంది బాప్తీస్మము పొంది రక్షింపబడిరి. ప్రతీ ఆదివారము అపొస్తలుల బోధయందు, సహవాసమందు, ప్రార్థన చేయుట యందు రొట్టెవిరచుట యందు ఎడతెగక యుండిరి. మనము కూడా అట్టిరీతిగా అభివృద్ధి చెందాలి. వాక్యమునకు విధేయత చూపుట ద్వారా ఆత్మీయముగా అభివృద్ధి చెందుదము.

నోవహు చెప్పిన వార్తను అనగా జలప్రళయము రాబోవు చున్నది అని చెప్పిన వార్తను జనులు నమ్మకపోవుటవలన ఓడ వెలపట యున్నవారందరూ దేవుని ఉగ్రతకు లోనై జలప్రళయములో నశించి పోయిరి. 1తిమోతి 1:19, 20 "అట్టి మనస్సాక్షిని కొందరు త్రోసివేసి విశ్వాస విషయమైన ఓడ బద్దలై పోయిన వారి వలె చెడి యున్నారు వారిలో హుమెనై యును, అలెక్సంద్రును ఉన్నారు. వీరు దూషింపబడకుండా శిక్షింపబడుటకై

వీరిని సాతానునకు అప్పగించిరి". అపొ. 27:10,11 "అప్పుడు పౌలు అయ్యలారా ఈప్రయాణమువలన సరకులను ఓడకును మాత్రమే కాక మన ప్రాణములను కూడా హానియు బహు నష్టము కలుగునట్లుగా నాకు తోచుచున్నది. అని చెప్పివారిని హెచ్చరిం చెను. అయినను శతాధిపతి పౌలు చెప్పినది నమ్మక నావికుడును ఓడ యజమానియు చెప్పినదే నమ్మెను. పౌలు మాట వినక పోవుట వల్ల గొప్ప తుఫానులో చిక్కుకొనిరి.

అపొ.27:21 "అయ్యలారా మీరు నామాటవిని క్రేతునుండి బయలుదేరక యుండవలసినది అప్పుడు ఈనష్టము కలుగకపోవును" అని పౌలు చెప్పెను. యోనా 1:6 యోనా దేవుని మాట వినకుండా తర్షీషునకు పోవు ఓడను ఎక్కి నిద్రించుచుండగా గొప్ప తుఫాను కలిగెను. సముద్రములో పడవేయబడెను. గొప్ప మత్స్యము యోనాను మ్రింగివేసెను.

దేవుని ఉగ్రతనుండి తప్పించు కొనవలెనంటే ఆయన మాట వినాలి. యోహాను 15:5' 'ద్రాక్షవల్లిని నేను తీగలు మీరు ఎవడు నాయందు నిలిచియుండునో వాడు బహుగా ఫలించును ... ఫలింపని ప్రతీ తీగ నరికి అగ్నిగుండములో వేయబడును.

**దేవుని సంరక్షణ :**

దేవుని మాటవిని ఓడలో ప్రవేశించిన నోవహు కుటుంబము జలప్రళయమునుండి రక్షించబడినది. నోవహు ఓడలో ప్రవేశించునప్పటికి అతని వయస్సు 600 సంవత్సరములు (ఆది 7:6). జలప్రళయము తరువాత ఓడనుండి బయటకు వచ్చునప్పటికి నోవహువయస్సు 601 సం॥ 2 నెల 7దినములు (ఆది.కా. 8:13,14). అనగా 1సంవత్సరం 2 నెలల 7 దినములు నోవహును అతని కుటుంబమును దేవుడు ఓడలో సంరంక్షించాడు.

అపొ 27:41-44 పౌలును అతనితో నున్న వారును తుఫాను నుండి రక్షించబడి మెలెతు అను ద్వీపమునుచేరిరి(ఎఫెసీ 2:1). "మీరు మీ అపరాధములచేతను పాపములచేతను చచ్చినవారై యుండగా ఆయన మిమ్మును క్రీస్తుతో కూడా బ్రతికించెను.

క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షావిధియులేదు.

**దేవుని యొక్క శాంతి :**

నోవహు ఓడలో శాంతి సమాధానం, ప్రశాంతత ఉన్నది. ఓడకు

వెలుపల కేకలు, బొబ్బలు, అరుపులు, ఏడుపు, భయం, ఉరుములు, మెరుపులు, జలముల ఘోషకలదు. ఓడ లోపల ప్రశాంతత నెమ్మది కలదు. మార్కు 4:39 "అందుకాయన (యేసుక్రీస్తు) లేచి గాలిని గద్దించి నిశ్శబ్ధమై ఊరకుండుము అని సముద్రముతో చెప్పగా గాలి అణిగి మిక్కిలి నిమ్మళమాయెను".

జలప్రళయమును రప్పించుటకు దానిని ఆపుటకు దేవునికి అధికారము ఉన్నది. తుఫానును ఆపుటకు ఆయనకు అధికారము ఉన్నది. కొలస్సీ 1:13-15 "ఆయన మనలను అంధకారసంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యని వాసులుగా చేసెను. ఆయన కుమారుని యందు మనకు విమోచన అనగా పాపక్షమాపణ కలుగుచున్నది. ఆయన అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆది సంభూతుడై యున్నాడు".

1 పేతురు 5:7 "ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తూ ఆయన మీద వేయుడి.

క్రీస్తు యేసునందు భద్రత యున్నది. క్రీస్తులో అభివృద్ధియున్నది. క్రీస్తులో సంరక్షణ యున్నది. క్రీస్తులో శాంతి యున్నది. క్రీస్తులో లేకపోతే క్రీస్తు మాటను వినకపోతే క్రీస్తుమాట ను అంగీకరించకపోతే శిక్షయున్నది. అదే నిత్యనరకము. క్రీస్తు యేసునందు న్నవారికి యే శిక్షా విధిలేదు.

నోవహు దేవుడు ఆతనికాజ్ఞా పించినది యావత్తు చేసెను. మనం కూడా క్రీస్తు యేసు ఆజ్ఞాపించిన విధముగా క్రీస్తు అనేబండపై మన పునాదివేసి కాని క్రీస్తు సంఘములో సహవాసము కల్గియుందము.

– బి.యస్.ఎ. సువార్త


**సత్యవాణి టి.వి కార్యక్రమములు :**

ప్రతి ఆదివారం సాయం **6గం॥లకు శుభవార్త**

ప్రతి బుధవారం సాయం **6:30 గంటలకు రక్షణ**

ప్రతి గురువారం ఉదయం **11:00 గం॥లకు రక్షణ**

www. satyavanicoc.com.

# ప్రభువు దినము
## (The Day of the Lord)

అపొ. పేతురు ఇట్లు వ్రాసాడు : "అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లువచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దాని మీదనున్నకృత్యములు కాలిపోవును. ఇవన్నియు ఇట్లులయమైపోవునవి గనుక ఆకాశములు రవులుకొని లయమైపోవునట్టియు పంచభూతములు మహావేండ్రముతో కరిగిపోవునట్టియు దేవుని దినపురాకడకొరకు కనిపెట్టుచు దానిని ఆశతో అపేక్షించుచు మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతోజాగ్రత్తగల వారైయుండవలెను. అయినను మనమాయన వాగ్దానమును బట్టి క్రొత్త ఆకాశముల కొరకును క్రొత్తభూమి కొరకును కనిపెట్టుచున్నాము, వాటి యందు నీతి నివసించును. ప్రియులారా, వీటికొరకు మీరు కనిపెట్టువారు గనుక శాంతముగల వారై ఆయన దృష్టికి నిష్కళంకులుగాను, నిందారహితులుగాను కనబడునట్లు జాగ్రత్తపడుడి" (2 పేతురు 3:10-14).

ఈలోకము నాశనము చేయబడు కాలాంతమును గూర్చి పేతురు ఇక్కడ వివరించాడు. దొంగవలె వచ్చు ఈ దినము కొరకు సిద్ధపడియుండుటయే మన జీవితధ్యేయము కావాలి. ఈ లోకజీవితము అశాశ్వతము గనుక క్రొత్త ఆకాశములు క్రొత్త భూమి కొరకు మనము అత్యంత ప్రాధాన్యత ఇయ్యాలి. పేతురు ఈ మాటలను రెండువేల సంవత్సరముల క్రితమే వ్రాసాడు. కొందరు అతని బోధను హేళన చేసారు (2 పేతురు 3:3-4), కొందరు నిర్లక్ష్యము చేసారు. అయితే దేవుడు తన వాగ్దానమును గూర్చి నిర్లక్ష్యము చేయువాడు కాదని పేతురు ఉద్ఘాటించాడు (2 పేతురు 3:9). ఆయన చెప్పినట్లేచేయును.

ఈలోకం అంతా గందరగోళముతో నిండియున్నది. అంతా అనిశ్చయతే. యుద్ధములు. ఆకలి, రోగము మొదలగువాటి వలన అనేకులు శ్రమలనొందుచున్నారు. ఈ క్లిష్టపరిస్థితుల నుండి బయటపడాలంటే క్రీస్తును, ఆయన రాజ్యమును మనం ముందు ఎంచుకోవాలి (మత్తయి 11:28-30). అనేకులుదైనందిన సాధక బాధకాలలో పట్టుబడియున్నారు. నిజానికి వాటి ఉపశమనము క్రీస్తులో యున్నది. క్రీస్తుకు మనం

నమ్మకముగా యుంటే, మనకు ఈలోకంలోను, రాబోవులోకంలోను సుఖజీవనం వాగ్దానము చేయబడి యున్నది. పేతురు చెప్పినట్లు మనం క్రొత్త ఆకాశములు కొరకును క్రొత్తభూమికొరకును కనిపెట్టవలయును. ఈలోకాంతమందు అవి సంభవించును.

సిద్ధపడిన వారికి ప్రభువు దినము ఒక గొప్పదినము. గనుక మనము "మనము ప్రభువైన యేసుక్రీస్తు అనుగ్రహించుకృపయందును జ్ఞానమందును అభివృద్ధిపొందవలెను. ఆయనకు ఇప్పుడును, యుగాంత దినము వరకును మహిమ కలుగునుగాక!" (2 పేతురు 3:18). అంతము వచ్చేసరికి ఎవరు అభివృద్ధి జెందుచుయుందురో వారు పరలోకమునకు సిద్ధపడి యుందురు.

- వేయిన్‌బేరియర్

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014

To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004